సాక్షి
వికారాబాద్
శనివారం । 25 । నవంబర్ । 2023



అధికారం ఇస్తే..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆడ బిడ్డ పెళ్లికి రూ.లక్ష నగదు, తులం బంగారం ఇస్తామని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸



కాంగ్రెస్‌లో చేరికలు

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



ముస్లింలు బీఆర్ఎస్ వైపే..

ముస్లింల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పత్తి సేకరణ సజావుగా జరగాలి: కలెక్టర్

వికారాబాద్ అర్బన్: జిల్లాలో పత్తి సేకరణ సజావుగా జరగాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పత్తి మద్దతు ధరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పత్తి సేకరణకు 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ.7,020, బీ గ్రేడ్ రకానికి రూ.6,920 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు బాగా ఆరబెట్టిన పత్తిని మిల్లులకు తెస్తే మద్దతు ధర లభిస్తుందని సూచించారు. వికారాబాద్, తాండూరు, మర్పల్లి, ధారూరు, కొడంగల్, కోట్‌పల్లిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 97 మంది రైతుల నుంచి 171.58 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డిని గెలిపించండి

మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలోని కోస్గి మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరఫున మంత్రి మహేందర్‌రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి నరేందర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరించారు. మద్దూరు మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి,ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పర్యటించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ప్రజలకు మేలు చేసే విధంగా మేనిఫెస్టోను తయారు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, తమ్మళి బాల్‌రాజ్ పాల్గొన్నారు.



కోస్గి మండలంలో ప్రచారం చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

పోలింగ్‌కు సిద్ధంకండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

27లోపు మౌలిక వసతులు కల్పించాలి

- 28వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ప్రచారాలు ముగించాలి
- 29న పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో 27వ తేదీ నాటికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలింగ్ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గం, మండల పర్యవేక్షణ పోలింగ్ లొకేషన్ మోడల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి, టాయిలెట్స్, టెంట్, ఫర్నిచర్ వంటివి సమకూర్చుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి ఎన్నికల అధికాలు పోలింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అభ్యర్థులు తమ ప్రచారాలను పూర్తిగా నిలిపివేయాలని కలెక్టర్ సూచించారు. ప్రచార ప్రక్రియ ముగిసిన తరువాత ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. జిల్లాలోని సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి ఈ నెల 29న ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. 30వ తేదీ ఉదయం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని ఆదేశించారు. ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ చేపట్టి 30 నిమిషాల్లో పూర్తి చేయాలన్నారు. 7 గంటలకు పోలింగ్ మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం ఐదు గంటల్లోపు పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చిన ఓటర్లకు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షమమహ్మద్

కేసీఆర్ లక్ష కోట్లు కాజేశారు

- ఏఐసీసీ అధికార ప్రతినిధి షమ మహ్మద్

పరిగి: కాళేశ్వరం పేరుతో సీఎం కేసీఆర్ లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి షమ మహ్మద్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని టీఆర్ఆర్ నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.40 వేల కోట్లతో పూర్తి చేస్తామన్న కేసీఆర్ రూ. లక్ష కోట్లు ఎందుకు ఖర్చు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రాజెక్టును నాసిరకంగా నిర్మించడంతో ఎక్కడికక్కడ కుంగిపోతోందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అది చేశాం, ఇది చేశాం అని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ వారు చేసింది ఏమీ లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ. 11వేల కోట్ల రుణ మాఫీ చేశామని, ఈ ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మంది రైతుల భూముల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి స్థానంలో భూమాత తెచ్చి రైతులకు మేలు చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని బీఆర్ఎస్ కాపీ కొట్టిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నిరుద్యోగ భృతి ఇస్తామని ఓట్లు దండుకొని మోసం చేశారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రోజులే



తాండూరులో ప్రచారం చేస్తున్న రోహిత్‌రెడ్డి

- మీ బిడ్డగా ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోరాదని బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చీకటి రోజులే అన్నారు. ఆ పార్టీవి దొంగ హామీలని ఆరోపించారు. తాండూరును ఆదర్శ వంతంగా, కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దామని తెలిపారు. తెలంగాణ రాకముందే మన ప్రాంతం తీవ్ర ఇబ్బందుల్లో ఉండేదన్నారు. రాష్ట్రం సాధించుకొని సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వేగంగా అభివృద్ధి చేసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగునీరు, కరెంటు కష్టాలను అధిగమించామని వివరించారు. కాంగ్రెస్ పాలనలో తాండూరు వివక్షకు గురైందన్నారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు తెచ్చానని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 16 వేలు, రూ.400లకే సిలిండర్, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా ప్రతి నెలా మహిళలకు రూ. 3,016, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్మన్ వీణ, సీనియర్ నాయకులు నర్సింహులు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

తాండూరు నియోజకవర్గంలోని క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలతో ఎమ్మెల్యే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్లకు ఎన్నడూ లేనంత గౌరవం లభించిందన్నారు. గతంలో తన గెలుపునకు అండగా నిలిచారని, ఈ సారి కూడా తనను గెలిపించాలని కోరారు. అనంతరం గొల్ల కురుమలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న డబ్బును చూపిస్తున్న పోలీసులు

భారీగా నగదు పట్టివేత

వాహన తనిఖీల్లో రూ.44.84 లక్షలు స్వాధీనం

బషీరాబాద్: జిల్లాలోని బషీరాబాద్‌లో భారీగా నగదు పట్టుబడింది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద గురువారం రాత్రి 11.30 గంటలకు పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. బషీరాబాద్ నుంచి తాండూరు వైపు వెళ్తున్న వీరశెట్టి రవి అనే జర్నలిస్టు బైక్‌ను ఆపి తనిఖీలు నిర్వహించారు. అతని వద్ద రూ.44.84 లక్షల నగదు లభించింది. ఎలాంటి పత్రాలు లేకుండా బషీరాబాద్ నుంచి తాండూరుకు డబ్బులు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన డబ్బు ఓ ప్రధాన పార్టీ అభ్యర్థికి చెందినదిగా ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘించి నగదు తరలిస్తున్న సదరు వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే స్వాధీనం చేసుకున్న డబ్బు తాండూరులోని తన ఇల్లును విక్రయించగా వచ్చిన సొమ్మని, ఇందుకు సంబంధించిన పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తానని బాధితుడు తెలిపారు.

క్లుప్తంగా

ఆనంద్‌ను గెలిపిస్తే అధిక నిధులు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

వికారాబాద్‌ అర్బన్‌: కారు గుర్తుకు ఓటేసి ఆనంద్‌ను గెలిపిస్తే వికారాబాద్‌ అభివృద్ధిలో మరింత దూసుకుపోతుందన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఆనంద్‌కు మరో అవకాశం ఇస్తే ఐటీ పరిశ్రమలు వచ్చే అవకాశం వస్తుందన్నారు. అనంతరం ఆనంద్‌ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ దళిత బంధు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లింలు బీఆర్‌ఎస్‌ వైపే..

పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ముస్లింలు

పరిగి: ముస్లింల అభ్యున్నతికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ముస్లింలు కాంగ్రెస్‌ నుంచి గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు బీఆర్‌ఎస్‌ వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ మోసం చేసేందుకు మాటలు చెప్పినా ముస్లింలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్‌ పెంచి వారికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ముచ్చటగా మూడో సారి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చి కేసీఆర్‌ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్‌ మాజీ సభ్యుడు మీర్‌మహ్మద్‌, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

దౌల్తాబాద్‌: కొడంగల్‌ శాసనసభ స్థానానికి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే గుర్‌నాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పోల్కంపల్లి, సేవబండ తండాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ.. గతంలో నరేందర్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఆయన అభివృద్ధిని విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్‌, సేవ్యానాయక్‌ తదితరులున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



దేవర్‌ఫసల్‌వాడ్‌ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

దౌల్తాబాద్‌: ఎన్నికల కోడ్‌ అమలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం తదితరాలను తరలించేవారిపై నిఘా పెట్టారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు బందోబస్తు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అంతర రాష్ట్ర రహదారిపై చంద్రకల్‌ చెక్‌పోస్టు వద్ద జిల్లా సరిహద్దు గ్రామమైన దేవర్‌ఫసల్‌వాడ్‌లో ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించారు. అనుమతి లేకుండా మద్యం, లెక్కకు మించి నగదు, బంగారాన్ని తరలిస్తే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్‌ అంటేనే నమ్మకం

- ఆశీర్వదిస్తే గర్వపడేలా అభివృద్ధి చేస్తా
- పదివేల మంది యువతకు ఉపాధి కల్పిస్తా
- డీసీసీబీ చైర్మన్‌, తాండూరు హస్తం అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- ముదిరాజ్‌ ఆత్మీయ సమ్మేళనం సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్‌



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ముదిరాజ్‌ కులస్తులు

తాండూరు: హస్తం గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గ ప్రజలు గర్వపడేలా అభివృద్ధి చేస్తానని డీసీసీబీ చైర్మన్‌, కాంగ్రెస్‌ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సభకు ముదిరాజ్‌లు వేలాదిమంది హాజరయ్యారు. ఈ సందర్భంగా బుయ్యని మాట్లాడుతూ.. ముదిరాజ్‌ సంఘం సంపూర్ణ మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూరు నుంచి కారును తరిమేయకుంటే ప్రమాదమన్నారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ నుంచి ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రజలకు కాంగ్రెస్‌ అంటేనే నమ్మకం.. అందుకే వారంతా మద్దతు తెలుపుతున్నారన్నారు. కాంగ్రెస్‌ పార్టీ నుంచి నాకు పోటీ చేసే



ప్రజలకు అభివాదం చేస్తున్న మనోహర్‌రెడ్డి

అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమన్నారు.

పారిశ్రామిక హబ్‌గా మారుస్తాం

అధికార పార్టీ నేతలు కాంగ్రెస్‌ నమ్మి మోసపోవద్దు అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. హస్తం పార్టీ భిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి కార్యకర్తలను మోసం చేసి కారెక్కింది ఎవరో గుర్తు చేసుకోకవాలని హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధిని మరిచి సొంత లాభం కోసం పనిచేసిన వ్యక్తిని ఇంటికి సాగనంపాలన్నారు. ప్రజలు హస్తానికి ఓటేసి గెలిపిస్తే తాండూరు ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. పారిశ్రామిక హబ్‌గా మార్చి 10 వేల మంది యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. తాండూరులో మహిళలు, యువత, ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, కుల, మత సంఘాలు తనకు మద్దతు ఇచ్చి నడిపిస్తున్నారన్నారు. ముదిరాజ్‌ సంఘం అందిస్తోన్న తోడ్పాటు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్‌, బషీరాబాద్‌ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేష్‌ మహరాజ్‌, ముదిరాజ్‌ సంఘం రాష్ట్ర నాయకులు ఉత్తమ్‌చంద్‌, నాయకులు వేణుగోపాల్‌, వెంకటేష్‌, హన్మంతు, ముదిరాజ్‌ కులస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించడం ఖాయం

- బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం
- బీసీలు, ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పిస్తాం
- ప్రజాధనాన్ని దోచుకున్న సీఎం కేసీఆర్‌ను లోపలేస్తాం
- అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ



రోడ్‌షోలో మాట్లాడుతున్న అస్సాం సీఎం హిమంతబిస్వ శర్మ

పరిగి: తెలంగాణ ఉద్యమంలో బీజేపీ పాత్ర ఎంతో కీలకమని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ అన్నారు. శుక్రవారం పరిగి పట్టణ కేంద్రంలో నిర్వహించిన బీజేపీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి నిలువునా మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఈసారి గద్దె దించుతారని తెలిపారు. ఎన్నికలు రాగానే వివిధ పార్టీలు ఇష్టానుసారంగా హామీలు ఇస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటిస్తున్నాయని, కానీ హిందువులకు ఇస్తామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఒక్కటేనని, అవి అగ్రవర్ణ పార్టీలని ధ్వజమెత్తారు. హిందువులంతా ఏకమై బీజేపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది అమరులయ్యారని, దళిత ముఖ్యమంత్రి హామీని కేసీఆర్‌ విస్మరించారని మండిపడ్డారు. తాను సీఎంగా ఉండి కూడా తన ఇంట్లోని వారికి మంత్రి పదవులు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్‌ చేసి ఎంతో మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. డబ్బులకు ఆశపడి ప్రశ్నాపత్రాలను లీక్‌ చేయించిందే ప్రభుత్వంలోని పెద్దలని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. బీసీని సీఎం చేస్తామని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్‌ని లోపలవేస్తామన్నారు. ప్రజాధానాన్ని దోచుకున్న సీఎంకు శిక్ష తప్పదని హెచ్చరించారు. పరిగిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ వారం రోజులు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతిఒక్కరు బీజేపీకి ఓటు వేసి మారుతికిరణ్‌కు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, సీనియర్‌ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి కుటుంబాలకు ‘కేసీఆర్‌ బీమా’

- గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దు
- బీఆర్‌ఎస్‌ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య

షాబాద్‌: బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రాగానే కోటి కుటుంబాలకు కేసీఆర్‌ బీమా వర్తింపజేస్తామని.. అసైన్డ్‌ భూములు అమ్ముకునేందుకు రైతులకు హక్కులు కల్పిస్తామని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కాలె యాదయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన షాబాద్‌ మండల పరిధిలోని నరెడ్లగూడ, కుమ్మరిగూడ, పోలారం, పోతుగల్‌, లక్ష్మారావుగూడ, వెంకమ్మగూడ, మక్తగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్‌, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో షాబాద్‌ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీల హామీనిచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్లు వెనక్కి పోతామన్నారు. బీఆర్‌ఎస్‌ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. రైతుల కష్టాలు సీఎం కేసీఆర్‌కు తెలుసు కాబట్టే.. రైతుబంధు, రుణ మాఫీని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింగ్‌రావు, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్‌, నర్సింహారెడ్డి, వెంకటయ్య, టీఎల్‌ఎఫ్‌ జిల్లా లీగల్‌ అడ్వైజర్‌ సతీశ్‌రెడ్డి, విశ్వం మాదిగ, సంజీవ, సర్పంచ్‌లు కేతన, మంగమ్మ, ఇస్మత్‌బేగం, అనిత, శ్రీనివాస్‌గౌడ్‌, రాములు, ఎంపీటీసీ సభ్యులు జమ్ముకమ్మ, సునీత, పార్వతమ్మ, అరుణ పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు బీఆర్‌ఎస్‌

పార్టీ తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మారుపేరు బీఆర్‌ఎస్‌ అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముద్దాయిపేట, తిమ్మాయిపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో రాష్ట్రం పురోగతి దశలో ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు అవుతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతరం జక్కేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్‌ నాయకులు యాదవరెడ్డి, గణేశ్‌ తదితరులు ఉన్నారు.

అధికారం ఇస్తే తులం బంగారం.. ఇందిరమ్మ ఇల్లు

- బీఆర్‌ఎస్‌ పాలనలో ఎమ్మెల్యే బంధువులకే అన్ని పథకాలు
- దళిత బంధు పేరిట దగా చేసేందుకు కుట్రలు
- కాంగ్రెస్‌ వికారాబాద్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌





వికారాబాద్‌ అర్బన్‌: గెరిగెట్‌పల్లిలో ప్రచారంలో మహిళల నృత్యం(ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ప్రసాద్‌ కుమార్‌

వికారాబాద్‌ అర్బన్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఆడ బిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ నగదుతో పాటుగా తులం బంగారం.. ఒక్కో కాలనీకి మూడు నుంచి 500 వరకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాజీ మంత్రి, పార్టీ వికారాబాద్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన మున్సిపల్‌ పరిధిలోని గెరిగెట్‌ పల్లి, శివారెడ్డిపేట్‌, కొత్రెపల్లి, ఎన్నెపల్లి, వెంకటపూర్‌ తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ కుమార్‌ మాట్లాడుతూ... కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ప్రతి పైసా పేదల సంక్షేమం కోసం ఖర్చు పెడుతుందన్నారు. కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీ పథకాలు అమలైతే పేద కుటుంబాలకు మేలు చేకూరుతుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో వికారాబాద్‌కు శాటిలైట్‌ సిటీ తెచ్చినట్లు గుర్తుచేశారు. కారు పార్టీకి మరోమారు అవకాశం ఇస్తే అసైన్డ్‌ భూములను అమ్మకానికి పెడుతుందని ఆరోపించారు.

ఒకేసారి దళితబంధు వట్టిదే..

నియోజకవర్గంలో ఒకేసారి అన్ని కుటుంబాలకు దళితబంధు ఇస్తానని కేసీఆర్‌ చెప్పడం బూటకమని ప్రసాద్‌ కుమార్‌ విమర్శించారు. దళిత సీఎం చేస్తానని మాట తప్పిన కేసీఆర్‌ పదేళ్లుగా దళితులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. గతంలో మునుగోడు ఉప ఎన్నికల్లోనూ ఇదే విషయాన్ని చెప్పిన కేసీఆర్‌ ఏడాది గడిచిన అక్కడ అడుగు పెట్టలేదన్నారు. ఎన్నికలు రాకముందు నియోజకవర్గంలోని దళితులందరికి ఎందుకు దళిత బంధు ఇవ్వలేదని, కేవలం ఎమ్మెల్యే బంధువులకే ఎందుకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్లుగా కొత్త రేషన్‌ కార్డుల ఊసేలేదన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌ రెడ్డి, మాజీ వైస్‌ చైర్మన్‌ రమేష్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హయాంలోనే భూ పంపిణీ

అనంతగిరి: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద, బడుగు, బలహీన వర్గాల సొంతింటి కళ నెరవేరుస్తామని పార్టీ వికారాబాద్‌ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మదన్‌పల్లిలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ తొమ్మిదిన్నర ఏళ్లలో ఒక్క డబుల్‌ ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నేటికీ గ్రామాల్లో వైఎస్సార్‌ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయన్నారు. వందల ఎకరాల్లో వైఎస్సార్‌ నాడు భూ పంపిణీ చేశారన్నారు. అవే భూములు నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నార్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు తప్పక అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ప్రజలు తనను ఆశీర్వదించాలని, వికారాబాద్‌ అభివృద్ధికి అహర్నిషలు పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రాంచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం.. సపరివారం

ఆరు గ్యారెంటీలకు అభయ‘హస్తం’



పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం వారు పలు కాలనీల్లో పర్యటిస్తూ.. ఆరు గ్యారెంటీలపై అభయమిస్తూ హస్తానికి ఓటేయాలని కోరారు. మున్సిపల్‌ చైర్మన్‌ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. - కొడంగల్‌

కడుపులో ‘మెతుకు’ అవుతాడు



సీఎం కేసీఆర్‌ సంక్షేమ పాలనను కొనసాగించేందుకు కారు గుర్తుకు ఓటేసి మరోసారి మెతుకు ఆనంద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి సబిత మండల పరిధిలోని ఎర్రవల్లిలో ప్రచారం నిర్వహించారు. - అనంతగిరి

మహేశ్‌రెడ్డి సంక్షేమ‘కారు’డు



కారు గుర్తుకు ఓటేస్తే ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసేందుకు కొప్పుల మహేశ్‌రెడ్డి అండగా ఉంటాడని ఆయన సతీమణి ప్రతిమారెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మార్కెట్‌ యార్డులోని కాలనీల్లో ఆమె సంక్షేమ పథకాలను వివరించారు. - పరిగి

ఆశీర్వదించండి.. ‘చేయూత’నిస్తాడు



తాండూరు ఎమ్మెల్యేగా మరొక్కసారి రోహిత్‌రెడ్డిని గెలిపిస్తే మహిళా చేయూత కోర్సులు కొనసాగుతాయని ఆయన తల్లి, వికారాబాద్‌ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదిని రెడ్డి కోరారు. శుక్రవారం ఆమె జీవన్గీ, క్యాద్గీరా, గంగ్వార్‌, నావంద్గీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. - బషీరాబాద్‌

కాంగ్రెస్‌లో స్వచ్ఛంద చేరికలు



బీఆర్‌ఎస్‌ నాయకులను పార్టీలోకి స్వాగతిస్తున్న టీఆర్‌ఆర్‌

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని టీఆర్‌ఆర్‌ నివాసంలో మాజీ వైస్‌ఎంపీపీ, ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర నాయకుడు మాణిక్యం ఆయన అనుచరులు, బీఆర్‌ఎస్‌ మల్లేపల్లి నాయకులు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు నచ్చి స్వచ్ఛందంగా ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలు సీఎం కేసీఆర్‌ మాటలు వినే పరిస్థితిలో లేరన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యకర్తలు ఐదు రోజులు కష్టపడితే ఐదేళ్ల పాటు మీకు సేవ చేస్తానన్నారు. బీఆర్‌ఎస్‌ మోసాలను ప్రతీ ఒక్కరికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

కాంగ్రెస్‌ పార్టీ గెలుపుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో దోమ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ సీనియర్‌ కార్యకర్తలు కసిరెడ్డి, అంజిలయ్యతో పాటు పలువురు నేతలు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వారికి టీఆర్‌ఆర్‌ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గుండాల గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు పటోళ్ల ప్రభాకర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, నరేశ్‌రెడ్డి, మల్లేపల్లి నాయకులు మొగులయ్యగౌడ్‌, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.